క్లుప్తంగా

శివాలయాల్లో ప్రత్యేక పూజలు



సరిపల్లిలో పూజలందుకున్న శివుడు

పెందుర్తి: పినగాడిలో కొలువుదీరిన చోడేశ్వర స్వామి దేవాలయం, సరిపల్లిలోని మల్లేశ్వర స్వామి ఆలయాల్లో సోమవారం ప్రత్యేక పూజలు జరిపారు. ఉదయం అభిషేకాల అనంతరం అలంకరణ చేశారు. శాస్త్రోక్తంగా పూజలు నిర్వహించారు. ఆలయ కమిటీ ఆధ్వర్యంలో భక్తులకు ప్రసాద వితరణ చేపట్టారు.

ఉమాచంద్రమౌళీశ్వరుడికి విశేష పూజలు



సింహాచలం: అడవివరం విజినిగిరిపాలెంలో ఉన్న ఉమాచంద్రమౌళీశ్వర స్వామి ఆలయంలో సోమవారం స్వామికి విశేషంగా అభిషేకాలు నిర్వహించారు. భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చి స్వామిని దర్శించుకున్నారు. ఉదయం నుంచి మధ్యాహ్నం వరకు భక్తులతో ఆలయం కిటకిటలాడింది. ఆలయ అర్చకులు ద్వాదశి సోదరులు ఈ కార్యక్రమాలను నిర్వహించారు.

సత్యనారాయణస్వామికి ప్రత్యేక పూజలు



పెందుర్తి: సాధుమఠం వద్ద ఉన్న రమా సత్యనారాయణస్వామి ఆలయంలో సోమవారం ప్రత్యేక పూజలు జరిపారు. ఆలయ ప్రధాన అర్చకులు మురళీకృష్ణశర్మ, రాజ ఉపేంద్రశర్మ ఆధ్వర్యంలో స్వామివాకి అర్చనలు జరిగాయి. అనంతరం భక్తులకు తీర్థప్రసాదాల వితరణ చేశారు.

సీతారాముల కల్యాణానికి ఏర్పాట్లు



పెందుర్తి: సుజాతనగర్ అయ్యప్పస్వామి దేవాలయ ప్రాంగణంలోని సంకట మోచన అభయాంజనేయస్వామి ఆలయంలో శ్రీరామ నవమి సందర్భంగా ఈ నెల 6న సీతారాముల కల్యాణం ఘనంగా నిర్వహించనున్నట్లు ఆలయ ధర్మకర్త వాకా చంద్రశేఖర్‌రెడ్డి తెలిపారు. ఈ మేరకు ఏర్పాట్లు చేస్తున్నట్లు పేర్కొన్నారు. భక్తులంతా ఉత్సవంలో పాల్గొనాల్సిందిగా కోరారు.

పాలిసెట్ రిజిస్ట్రేషన్లు ప్రారంభం

పెందుర్తి: స్థానిక ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో పాలిసెట్–2025 పరీక్ష కోసం రిజిస్ట్రేషన్లు ప్రారంభమైనట్లు ప్రిన్సిపాల్ డాక్టర్ ఎస్.చంద్రశేఖర్ సోమవారం ఓ ప్రకటనలో తెలిపారు. పదో తరగతి పాసైన వారు, ఈ ఏడాది చదువుతున్న వారు పాలిసెట్‌కు అర్హులన్నారు. ఓసీ, బీసీ విద్యార్థులు రూ.400, ఎస్సీ, ఎస్టీ విద్యార్థులు రూ.100 ఫీజు చెల్లించాలన్నారు. ఈ నెల 15 వరకు విద్యార్థులు రిజిస్ట్రేషన్లు చేసుకోవచ్చని, 30న పరీక్ష నిర్వహించనున్నట్లు వెల్లడించారు. ఈ పరీక్ష కోసం ఉచిత శిక్షణ బుధవారం నుంచి ప్రారంభిస్తున్నట్లు పేర్కొన్నారు.

నేడు 'ఆదర్శ్'లో జాబ్ మేళా

పెందుర్తి: స్థానిక ఆదర్శ్ డిగ్రీ కళాశాలలో మంగళవారం జాబ్ మేళా నిర్వహించనున్నట్లు ప్రిన్సిపాల్ ఎస్.ఇ.ఫ్లోరా సోమవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఉదయం 9.30 నుంచి ప్రారంభం కానున్న మేళాలో హనీ గ్రూప్ సంస్థలో కొలువులకు ఇంటర్వ్యూలు నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. 2022 నుంచి 2025(చివరి సెమిస్టర్ చదువుతున్న విద్యార్థులూ అర్హులే) ఉత్తీర్ణత సాధించిన వారు ఇంటర్వ్యూలకు హాజరు కావచ్చని తెలిపారు.

ఘనంగా త్రిమాత ఆలయ వార్షికోత్సవం



అన్నసమారాధన ప్రారంభిస్తున్న ముమ్మన దేముడు

పెందుర్తి: చింతలగ్రహారంలో కొలువైన దుర్గమాంబ, బండిమాంబ, మెట్టమాంబ(త్రిమాత) ఆలయ 16వ వార్షికోత్సవం సోమవారం ఘనంగా నిర్వహించారు. అమ్మవార్లకు విశేష అభిషేకాలు జరిపి, ప్రత్యేకాలంకరణ చేశారు. వేలాదిగా తరలివచ్చిన భక్తులు కుంకుమ పూజలు జరిపారు. మధ్యాహ్నం జరిగిన అన్నసమారాధనలో దాదాపు 4 వేల మంది ప్రసాదం స్వీకరించారు. సాయంత్రం పలు సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. ఆలయాల అభివృద్ధికి సహకారం అందించిన రైల్వే ఇంజినీర్ సద్దేశ్‌ను గ్రామస్తులు ఘనంగా సత్కరించారు. కార్పొరేటర్ ముమ్మన దేముడు, సర్పంచ్ దాడి గోపి అప్పలనాయుడు, మాజీ సర్పంచ్‌లు ఆళ్ల తాతారావు, పి.అప్పారావు, పి.వెంకటరమణ, నాయకులు, గ్రామపెద్దలు, అధిక సంఖ్యలో భక్తులు అమ్మవారిని దర్శించుకున్నారు.

పాలిటెక్నిక్ డిప్లొమా.. కొలువుల ధీమా



పెందుర్తిలోని ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల

- అత్యాధునిక సౌకర్యాల నెలవు పెందుర్తి పాలిటెక్నిక్ కళాశాల
- కళాశాలలోనే నిరంతర శిక్షణ అందిస్తున్న మూడు ప్రైవేట్ సంస్థలు
- ఉపాధి అవకాశాలు మెరుగుపరిచేందుకు వర్క్‌షాప్‌ల నిర్వహణ
- ఒక ఏడాదిలో రికార్డు స్థాయిలో 229 మందికి కొలువులు
- ఈ ఏడాది నాలుగు కోర్సుల్లో 264 సీట్ల భర్తీకి రంగం సిద్ధం

ప్రస్తుత కాలంలో సంప్రదాయ విద్య కంటే.. సాంకేతిక (పాలిటెక్నిక్) విద్య వైపే విద్యార్థులు మొగ్గుచూపుతున్నారు. కళాశాల చదువు పూర్తయిన వెంటనే కొలువులో చేరేందుకు టెక్నికల్ ఎడ్యుకేషన్ ఎంతగానో ఉపయోగపడుతుంది. విద్యార్థులు తమకు నచ్చిన బ్రాంచ్‌లో అత్యున్నత స్థాయిలో తర్ఫీదు పొందితే.. పరిశ్రమలు పిలిచి మరీ వారికి చక్కటి అవకాశాలతో ఉపాధినిస్తున్నాయి. ఇందుకు నిదర్శనమే పెందుర్తి పాలిటెక్నిక్ కళాశాలలో ఒకే ఏడాదిలో 229 మంది కొలువులు సాధించడం. కళాశాల మరిన్ని మెరుగైన వసతుల్ని సమకూర్చుకుని, మరో కొత్త బ్యాచ్‌కు ఆహ్వానం పలుకుతోంది.



కళాశాలలో విద్యార్థులు



స్కిల్ హబ్‌లో హ్యాండ్ ఎంబ్రాయిడరీ శిక్షణ పొందుతున్న మహిళలు



కళాశాలలో ఆటోక్యాడ్ వెర్షన్‌తో అధునాతన కంప్యూటర్ ల్యాబ్



విద్యార్థులకు కంప్యూటర్ హార్డ్‌వేర్‌లో శిక్షణ

పెందుర్తి:

స్థానిక ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలకు ఏటా ఆదరణ పెరుగుతోంది. గత ప్రభుత్వ హయాంలో తీసుకున్న చర్యలు, కేటాయించిన నిధులతో విద్యార్థులకు కావాల్సిన అన్ని సౌకర్యాలు అందుతున్నాయి. విద్యార్థులకు వారికి నచ్చిన అంశంలో నాణ్యమైన శిక్షణ అందించేందుకు తగినంత మంది అధ్యాపకులు/శిక్షణ నిపుణులు అందుబాటులో ఉన్నారు. కొన్ని పేరొందిన సంస్థలు కార్పొరేట్ సామాజిక బాధ్యత(సీఎస్సార్) నిధులతో ఈ కళాశాలలో సౌకర్యాలు కల్పించడంతోపాటు, నైపుణ్యాల్లో శిక్షణకు సహకరిస్తున్నాయి. దీంతో కళాశాలలో చదువు కోసం అడుగు పెట్టిన విద్యార్థులు.. చేతిలో అపాయింట్‌మెంట్ ఆర్డర్‌తో బయటకు వెళుతున్నారు.



ప్లేస్‌మెంట్ డ్రైవ్‌లో కొలువులు పొందిన విద్యార్థులు

జోరుగా ఉపాధి అవకాశాలు

మూడేళ్ల కోర్సులు ఉన్న ఈ కళాశాలలో ఉపాధి అవకాశాలు రాన్రాను మెరుగుపడుతున్నాయి. 2018–21 బ్యాచ్‌లో 13 మంది క్యాంపస్ నుంచి ఉద్యోగాలు పొందగా, 2019–22 బ్యాచ్‌కు ఆ సంఖ్య 24కు పెరిగింది. తాజాగా కళాశాలలో విద్యార్థుల సృజనాత్మకతను మెరుగుపరిచేందుకు నిర్వహిస్తున్న వర్క్‌షాప్‌లు విజయవంతం అవుతున్నాయి. విద్యార్థుల్లో సాంకేతిక అంశాలపై గట్టి పట్టు రావడంతో పాటు వారిలో ఆత్మవిశ్వాసం పెరుగుతోంది. ఈ నేపథ్యంలో ఈ ఏడాది క్యాంపస్ నుంచి రికార్డు స్థాయిలో 229 మంది రాష్ట్రంతో పాటు ఇతర రాష్ట్రాల్లోని ప్రముఖ సంస్థల్లో ఉపాధి పొందారు.

వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో దశ మారింది

పాలిటెక్నిక్ కళాశాలను రూ.9.7 కోట్లతో 22 గదుల భవనంలో 2018లో ప్రారంభించారు. సివిల్, మెకానికల్, ఈఈఈ, ఈసీఈ బ్రాంచ్‌ల్లో, ఒక్కో బ్రాంచ్‌కు 60 సీట్లు కేటాయించారు. ఆ తర్వాత బ్రాంచ్‌కు మరో 6 సీట్లు పెంచారు. దీంతో బ్రాంచ్‌కు 66 మంది చొప్పున 264 మంది ప్రస్తుతం తొలి ఏడాదిలో చేరే అవకాశం ఉంది. తొలినాళ్లలో సౌకర్యాల లేమితో కళాశాలలో చేరేందుకు విద్యార్థులు పెద్దగా ఆసక్తి కనబరిచేవారు కాదు. అయితే 2020–21 విద్యా సంవత్సరం నుంచి కళాశాల దశ తిరిగింది. అప్పటి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం సాంకేతిక విద్యపై శ్రద్ధ పెట్టడంతో ఈ కళాశాలకు రూ.8 కోట్ల నిధులు వచ్చాయి. దీంతో ఇక్కడ 20 గదులతో అదనపు భవన నిర్మాణం జరిగింది. అదే సమయంలో ఏపీ స్కిల్ డెవలప్‌మెంట్ బోర్డు స్కిల్ హబ్‌ను ఏర్పాటు చేసింది. దీంతో కళాశాల దశ మారిపోయింది.

ప్రైవేట్ సంస్థల తోడ్పాటు

- 2021లో గంగవరం పోర్టు యాజమాన్యం సీఎస్సార్ నిధులు రూ.37 లక్షలతో పూర్తిస్థాయి మౌలిక సదుపాయాలు కల్పించింది.
- విద్యార్థుల్లోని సాంకేతిక ప్రతిభను మెరుగుపరిచేందుకు 'మై యాక్సెస్'సంస్థ రూ.15 లక్షలతో అత్యాధునిక ల్యాబ్‌ను ఏర్పాటు చేసి, శిక్షణ అందిస్తోంది.
- 'లోటస్ వైర్‌లెస్ టెక్నాలజీస్'సంస్థ రూ.35 లక్షలతో అన్ని సౌకర్యాలతో కూడిన ల్యాబ్‌ను ఏర్పాటు చేసి, వారే ఇక్కడి విద్యార్థులకు తర్ఫీదునిచ్చి ఉపాధి అవకాశాల మెరుగుకు సహకరిస్తున్నారు.
- 'రాయల్ ఎలక్ట్రిక్ వెహికల్' సంస్థ రూ.6 లక్షలతో ల్యాబ్ సామగ్రి సమకూర్చి, విద్యుత్ వాహనాల మెకానిజం, ఇతర అంశాలపై విద్యార్థులకు శిక్షణ అందిస్తోంది.
- వీటితోపాటు స్కిల్ హబ్‌లో నిరుద్యోగులకు వెల్డింగ్, మహిళలకు హ్యాండ్ ఎంబ్రాయిడరీ(బ్యాచ్‌కు 30 మంది/3 నెలల కోర్సు)లలో శిక్షణ ఇస్తూ, స్వయం ఉపాధికి సహకారం అందిస్తోంది.

మరిన్ని సౌకర్యాల ఏర్పాటే లక్ష్యం



సాంకేతికరంగంలో రోజురోజుకూ అవకాశాలు మెరగవుతున్నాయి. ఈ క్రమంలో విద్యార్థుల్లో సృజనాత్మక మెరుగుపడేందుకు వారికి తగిన సౌకర్యాలు కల్పించాలి. నాలుగైదేళ్ల నుంచి ఆ దిశగా మేం విజయవంతమైన అడుగులు వేశాం. ప్రస్తుతం కళాశాలకు అవసరమైన సదుపాయాలున్నాయి. మరిన్ని అదనపు వసతుల కోసం ప్రయత్నాలు చేస్తున్నాం. ఈ విద్యా సంవత్సరంలో ఇంత భారీగా విద్యార్థులు కొలువులు సాధించడం సంతోషంగా ఉంది. రానున్న రోజుల్లో ఈ రికార్డును మరింత మెరుగుపరిచేందుకు కృషి చేస్తాం.

– డాక్టర్ ఎస్.చంద్రశేఖర్, ప్రిన్సిపాల్

ఎగసిపడుతున్న దుమ్మూధూళితో ఇబ్బందులు



ఎన్టీపీసీ వద్ద అలముకున్న దుమ్మూధూళి

పరవాడ: వాడచీపురుపల్లి–పరవాడ రహదారిలో సింహాద్రి ఎన్టీపీసీ వద్ద భారీ వాహనాల రాకపోకలతో దుమ్మూధూళి ఎగసిపడుతోంది. దీంతో సమీప గ్రామాల ప్రజలు అవస్థలు పడుతున్నారు. ఎన్టీపీసీ నుంచి బూడిదను ఎగుమతి చేసేందుకు రాకపోకలు సాగిస్తున్న భారీ వాహనాలు అధిక సంఖ్యలో లారీ యార్డుకు వస్తాయి. యార్డు నుంచి బూడిద లోడింగ్‌కు సమీపంలోని స్టాక్ పాయింట్‌కు రాకపోకలు సాగించే క్రమంలో బూడిద ఎక్కువగా రేగుతోంది. స్థానిక పాన్ షాపులు, టీ దుకాణాలు, భోజన హోటళ్లను ఈ దుమ్మూధూళి కమ్ముకోవడంతో తమ వ్యాపారాలు సన్నగిల్లుతున్నాయని వర్తకులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. నిత్యం ఈ రహదారిలో రాకపోకలు సాగించే తంతడి, నాయుడుపాలెం, ముత్యాలమ్మపాలెం, వాడచీపురుపల్లి తదితర గ్రామాల ప్రజలు ఈ ధూళిని పీల్చడం వల్ల, అనారోగ్య సమస్యలు ఎదుర్కొంటున్నట్లు వాపోతున్నారు. గతంలో లారీల రాకపోకల సమయంలో ధూళి నియంత్రణకు ఆ ప్రదేశాలను నీటితో తడిపేవారు. ప్రస్తుతం ఆ పద్ధతికి యాజమాన్యం తిలోదకాలిచ్చింది. ఎన్టీపీసీ మెయిన్ గేట్ పరిసరాల్లో ఎగసిపడుతున్న ధూళి నియంత్రణకు యాజమాన్యం చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

అపార్ట్‌మెంట్లలో సీసీ కెమెరాలు తప్పనిసరి



కంఫర్ట్‌హోం అపార్ట్‌మెంట్‌లో సీసీ కెమెరాలను పరిశీలిస్తున్న క్రైం సీఐ శ్రీనివాసరావు, ఎస్‌ఐ సూరిబాబు

పెందుర్తి: ప్రజల సహకారంతోనే నేరాల నియంత్రణ సాధ్యమని వెస్ట్ జోన్ క్రైం విభాగం సర్కిల్ ఇన్‌స్పెక్టర్ ఎస్.శ్రీనివాసరావు అన్నారు. ప్రతి అపార్ట్‌మెంట్‌లోనూ తప్పనిసరిగా సీసీ కెమెరాలను ఏర్పాటు చేసుకోవాలని సూచించారు. జీవీఎంసీ 95వ వార్డు పురుషోత్తపురంలోని కంఫర్ట్ హోమ్స్ గేటెడ్ కమ్యూనిటీ అపార్ట్‌మెంట్‌లో 150 ఫ్లాట్ల యజమానులు, తమ నివాసాలకు సీసీ కెమెరాలను ఏర్పాటు చేశారు. వాటిని ప్రారంభించిన సీఐ మాట్లాడుతూ జోన్ పరిధిలో దొంగతనాల నియంత్రణకు పూర్తిస్థాయిలో కృషి చేస్తున్నామని తెలిపారు. వేసవికాలంలో ప్రజలు చోరీల పట్ల అప్రమత్తంగా ఉండాలని సూచించారు. ప్రజలు ఎక్కువ రోజులు బయటకు వెళితే తప్పనిసరిగా సమీపంలోని పోలీస్ స్టేషన్‌లో సమాచారం అందించాలన్నారు. ప్రతి ప్రాంతంలో రాత్రి సమయంలో గస్తీ నిర్వహిస్తున్నట్లు వెల్లడించారు. అనంతరం అపార్ట్‌మెంట్‌వాసులు నూతనంగా ఏర్పాటు చేసుకున్న స్విమ్మింగ్ పూల్‌ను సీఐ ప్రారంభించారు. ఎస్‌ఐ డి.సూరిబాబు, అపార్ట్‌మెంట్ ప్రతినిధులు, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

పండగల్లో జూదమాడితే కఠిన చర్యలు


- పెందుర్తి సీఐ సతీష్‌కుమార్ హెచ్చరిక



పెందుర్తి: గ్రామాల్లో అమ్మవారి పండగలు, ఇతర కార్యక్రమాలు, వారాంతాల్లో పేకాట, కోడిపందాలు, గుండాట వంటి జూదాలకు పాల్పడితే చట్ట ప్రకారం కఠిన చర్యలు తీసుకుంటామని సర్కిల్ ఇన్‌స్పెక్టర్ కె.వి.సతీష్‌కుమార్ హెచ్చరించారు. హైకోర్టు ఆదేశాల మేరకు పెందుర్తి పోలీస్ స్టేషన్ పరిధిలో పూర్తిగా జూదాన్ని నిషేధించామన్నారు. పండగల్లో అశ్లీల నృత్యాలు, ఇతర అసాంఘిక కార్యకలాపాలు కూడా నిషిద్ధమన్నారు. అమ్మవార్ల పండగలు ప్రశాంత వాతావరణంలో నిర్వహించుకోవాలని సూచించారు. శాంతి భద్రతలకు విఘాతం కలిగిస్తే, ఎంతటివారినైనా ఉపేక్షించబోమని స్పష్టం చేశారు. ఐపీఎల్ మ్యాచ్‌లు జరుగుతున్న నేపథ్యంలో బెట్టింగ్‌లు నిర్వహిస్తే కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. బెట్టింగ్ వ్యవహారంపై ప్రత్యేక నిఘా ఏర్పాటు చేసినట్లు పేర్కొన్నారు.

భూ ఆక్రమణలకు పాల్పడితే చర్యలు తప్పవు

- తహసీల్దార్ ఆనందకుమార్



పెందుర్తి: ప్రభుత్వ భూముల దురాక్రమణకు పాల్పడితే చట్ట ప్రకారం కఠిన చర్యలు తీసుకుంటామని మండల తహసీల్దార్ ఎం.ఆనంద్‌కుమార్ హెచ్చరించారు. సోమవారం సాక్షితో మాట్లాడిన ఆయన ఎట్టి పరిస్థితిలోనూ ప్రభుత్వ భూములు అన్యాక్రాంతం కావడాన్ని సహించబోమన్నారు. జిల్లా ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు ప్రభుత్వ భూముల సంరక్షణపై ప్రత్యేక దృష్టి సారించామన్నారు. క్షేత్రస్థాయిలో సిబ్బందిని అన్నివేళలా అప్రమత్తంగా ఉంచుతున్నామని చెప్పారు. ఇటీవల కాలంలో అక్రమ క్వారీ తవ్వకాలపై ఫిర్యాదులు వస్తున్న నేపథ్యంలో ఆయా ప్రాంతాల్లో గట్టి నిఘా ఉంచుతున్నామన్నారు. ప్రభుత్వ భూములు ఆక్రమించి విక్రయాలు చేస్తున్న వారిపై క్రిమినల్ కేసులు నమోదు చేస్తామన్నారు. ప్రభుత్వ భూముల్ని బ్రోకర్ల ద్వారా కొనుగోలు చేస్తే ఆర్థికంగా నష్టపోతారని హెచ్చరించారు. ఇంటి స్థలం, ఇళ్లు లేని వారికి ప్రభుత్వం స్థలాలు మంజూరు చేసే ప్రక్రియ త్వరలో ప్రారంభం కానుందన్నారు. నిబంధనల మేరకు దరఖాస్తు చేసుకుంటే అర్హతలను క్షేత్రస్థాయిలో పరిశీలించి ఇంటి స్థలాలను ప్రభుత్వం అందిస్తుందని వెల్లడించారు.

భక్తిశ్రద్ధలతో రంజాన్



సరిపల్లిలో ప్రార్థనలు, ఈద్ ముబారక్ చెప్పుకుంటున్న ముస్లిం పెద్దలు

చినముషిడివాడలో ప్రార్థనల్లో ముస్లింలు

పెందుర్తి: రంజాన్ వేడుకలను నియోజకవర్గంలోని ముస్లింలు సోమవారం భక్తిశ్రద్ధలతో జరిపారు. చినముషిడివాడలోని మజీద్ ఏ నురానీలో ఉదయం ప్రత్యేక ప్రార్థనలు జరిగాయి. పరస్పర శుభాకాంక్షలు(ఈద్ ముబారక్) చెప్పుకున్నారు. పెందుర్తి పాతూరులోని మస్జిద్ ఏ రజాయేలో ప్రార్థనలు చేశారు. సరిపల్లి, పులగానిపాలెం, సప్తగిరినగర్, వేపగుంట మసీదుల్లో ప్రార్థనలు నిర్వహించారు. ముస్లిం పెద్దలు షేక్ బృహాన్, సాకీర్, షేక్ బాబాలాల్, షేక్ సైదు, షేక్ షఫీవుల్లా, షేక్ రహిమాన్, మహమ్మద్ హుస్సేన్ రిజ్వి, షేక్ కరీముల్లా, షేక్ ఇబ్రహీం, షేక్ మదీనా, పలువురు ప్రజాప్రతినిధులు, నాయకులు ప్రార్థనల్లో పాల్గొని శుభాకాంక్షలు అందజేశారు.

పరవాడ: పవిత్ర రంజాన్ పర్వదిన వేడుకలను మండలంలో ముస్లిం సోదరులు ఘనంగా జరిపారు. పరవాడ, రావాడ దరి గొల్లగుంట, వాడచీపురుపల్లి, ఎన్టీపీసీ ప్రాంతాల్లోని ఈద్గాల వద్దకు వెళ్లి ముస్లిం సోదరులు ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. ఒకరినొకరు ఆలింగనం చేసుకుని శుభాకాంక్షలు చెప్పుకున్నారు. ప్రేమ, సోదరభావం, శాంతికి చిహ్నమే రంజాన్ పర్వదినమని ముస్లిం పెద్దలు పేర్కొన్నారు. 30 రోజుల పాటు కఠోర ఉపవాస దీక్షలున్న వారు అల్లా అనుగ్రహం పొందుతారన్నారు. అల్లా చల్లని దీవెనలతో ప్రజలు సుఖ సంతోషాలతో జీవించాలని ముస్లిం పెద్దలు ఆకాంక్షించారు. కార్యక్రమంలో మతగురువులు షబ్బీరు హమ్మద్, నసిరుల్లా ఖాన్, సుభానీ, అన్సార్ ఆలీ, అబ్దుల్ రజాక్, ఫాజిలే హుస్సేన్, అబ్దుల్ జలీల్, యాసిన్, ఖలీల్, అక్బర్ బాషా, మిస్కిన్ ఆలీ, బషీర్ పాల్గొన్నారు.



ఈద్గాలో నమాజ్ చేస్తున్న ముస్లిం సోదరులు

నేడు వాడచీపురుపల్లిలో పింఛన్ల పంపిణీ

పెందుర్తి: ప్రభుత్వం అందిస్తున్న సామాజిక పింఛన్లను పరవాడ మండలం వాడచీపురుపల్లిలో అనకాపల్లి జిల్లా కలెక్టర్ విజయ కృష్ణన్, ఎమ్మెల్యే పంచకర్ల రమేష్‌బాబు చేతుల మీదుగా మంగళవారం పంపిణీ చేయనున్నారు. ఈ మేరకు సుజాతనగర్‌లోని ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయం ప్రతినిధులు సోమవారం ఓ ప్రకటన విడుదల చేశారు. ఉదయం 8 గంటల నుంచి పింఛన్ల పంపిణీ కార్యక్రమం ప్రారంభమవుతుందని పేర్కొన్నారు. లబ్ధిదారులంతా హాజరై పింఛన్లు అందుకోవాల్సిందిగా ఆ ప్రకటనలో కోరారు.

పచ్చగడ్డి కోసం అల్లాడుతున్న మూగజీవాలు



తీరంలో గడ్డిపరకలు ఏరుకుంటున్న మేకలు

పరవాడ: ఎండలు మండిపోతున్నాయి. మండలంలో పచ్చిక బయళ్లు ఎండిపోయాయి. దీంతో మూగజీవాలు పచ్చగడ్డి దొరక్క అల్లాడుతున్నాయి. మండలంలో పెదముషిడివాడ, వాడచీపురుపల్లి దరి గొల్లపేట, వెన్నలపాలెం దరి గొల్లలపాలెం, రావాడ దరి బొట్టవానిపాలెం, నాయుడుపాలెం దరి గొల్లపేట గ్రామాలకు చెందిన రైతులు గొర్రెలు, మేకలను మేపుతూ జీవనం సాగిస్తున్నారు. ఎండాకాలం రావడంతో మూగ జీవాల పోషణ వారికి తలకు మించిన భారంగా మారింది. అక్కడక్కడ కొండ బంజర్లలో ఉన్న పశు గ్రాసం కూడా ఎండిపోయింది. మరో దారి లేక సరుగుడు, వేప ఆకుల్ని తినిపించాల్సి వస్తోందని పాడిరైతులు వాపోతున్నారు. స్థానికులు కొండ బంజర్లను ఆక్రమించి జీడి తోటలను సాగు చేయడంతో గొర్రెలు, మేకలకు గ్రాసం కొరత మరింతగా పెరిగింది. పండగలు, పబ్బాలకు ఇళ్ల వద్ద మేపుకుంటున్న గొర్రెలు, మేకల్ని సాకడం కూడా తలకు మించిన భారంగా మారిందని ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

శేష జీవితం ఆనందంగా గడపాలి



వీఆర్‌ఎస్ ఉద్యోగులను సత్కరిస్తున్న శ్రీనివాసనగర్ అసోసియేషన్ ప్రతినిధులు

అగనంపూడి: అంతర్జాతీయ ఖ్యాతి పొందిన విశాఖ ఉక్కు కార్మికులు, ఉద్యోగులను స్వచ్ఛంద పదవీ విరమణ పేరుతో బలవంతంగా బయటకు నెట్టడం బాధాకరమని జీవీఎంసీ 79వ వార్డు కార్పొరేటర్ రౌతు శ్రీనివాసరావు, 85వ వార్డు నాయకుడు దుల్ల రామునాయుడు అన్నారు. అగనంపూడికి చెందిన ముగ్గురు ఉక్కు ఉద్యోగులు నక్కా రామూర్తి, గంధం బాబూరావు, బి.సుబ్రహ్మణ్యం స్వచ్ఛంద పదవీ విరమణ సందర్భంగా శ్రీనివాసనగర్ కాలనీ, ఆఫీషియల్‌నగర్ రెసిడెన్స్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఘనంగా సత్కరించారు. శేష జీవితం ఆనందమయంగా సాగాలని వారు ఆకాంక్షించారు.

కార్యక్రమంలో నాయకులు గంధం వెంకటరావు, కాలనీ అసోసియేషన్ ప్రతినిధులు ఎం.రామారావు, చల్లా శ్రీనివాసరావు, గొల్లవిల్లి కనక భవాని, మేడిశెట్టి విజయ్‌కుమార్, కరణం సత్యారావు పాల్గొన్నారు.